# కర్మభూమి

అర్ధరాత్రి పన్నెండు దాటుతుంటే... సెల్ మోగింది.

అప్పటికి నేనింకా నిద్రపోలేదు.

కాలిఫోర్నియా నించి అమరేంద్ర లైన్‌లో వున్నాడు.

'హలో... ఎలా వున్నావురా' అనడిగాను.

"నువ్వింకా నిద్రపోలేదు కదా..." అన్నాడు అవతల్నించి

"లేదురా... ఈ రోజు నీ ఫోనొస్తుందని తెల్సుకదా... ఇంతకీ ఏంటి విశేషాలు. రేపటికి నువ్ అమెరికా వెళ్లి ఏడాదవుతోంది. ఉద్యోగం పరిస్థితేంటి... ఉంటుందా... ఊడుతుందా! " అన్నాను.

"ఆర్థికమాంద్యం దెబ్బలు పడుతున్నా... మా కంపెనీ పర్లేదురా... బాగుంది" అన్నాడు.

"ఇండియాకి ఎప్పుడొస్తావ్... కరీంనగర్‌లో ఓ పెళ్లి సంబంధం వుందిరా" అన్నాను.

"సారీరా... మూడేళ్లవరకూ రాను.. నేను ఫోన్ చేసింది పెళ్లి సంబంధం గురించి కాదు. మన ఫ్రెండ్స్ మీద ఒక పెద్ద బాధ్యత పెడుతున్నాను" అన్నాడు.

చివరి వాక్యం మాట్లాడేటప్పుడు వాడి గొంతు కొంచెం గంభీరంగా మారింది. మేటరేదో సీరియస్ అన్నట్టుగా తోచింది.

"అంత పెద్ద బాధ్యతేంట్రా... నీ పెళ్లి సంబంధం కంటే కూడానా..." అన్నాను నవ్వుతూ.

"అవును... పది నిమిషాలు నోర్మూసుకొని విను..." అన్నాడు కొంచెం సీరియస్‌గా. నాకేం అర్థం కాలేదు.

"సరే... చెప్పు" అన్నాను.

"ఇండియన్ కరెన్సీలో ఆరు లక్షల రూపాయలు నీకు పంపిస్తున్నాను. మనూరి శ్మశానం దగ్గర్లో రెండు వందల గజాల ప్లాట్‌కొని ఇల్లు కట్టించాలి..." అన్నాడు.

కొంచెం సేపు నిశ్శబ్దం...

వాడి మాటతో నాకు బుర్ర తిరిగిపోయింది.

"శ్మశానం దగ్గర కొనడమేంట్రా నీ బొందా... రియల్ ఎస్టేట్ బూమ్ తగ్గింది. సిటీకి దగ్గర్లోనే ప్లాట్ కొనచ్చు" అన్నాను.

"నన్ను చెప్పనీయ్‌రా... ప్లీజ్... మాట్లాడకు" అన్నాడు ఇంకొంచెం సీరియస్‌గా...

"సరే" అనికూడా అన్లేదు. మౌనంగా వుండిపోయాను.

"శ్మశానానికి దగ్గర్లో భూమి కొను. లక్ష రూపాయల్లో రెండు వందల గజాలు రావచ్చు. మిగతా అయిదు లక్షల్లో మూడు నాలుగు గదులుండే ఇల్లు కట్టించు. డబ్బు సరిపోకపోతే మరో రెండు లక్షలు పంపిస్తాను." అన్నాడు.

"అమెరికా నించి వచ్చాక శ్మశానం దగ్గర కాపురముంటావా? నవ్విపోతారు" అనకుండా వుండలేకపోయాను.

"నాకోసం... కాదురా" అన్నాడు. ఖండాంతరాల్నించి కూడా వాడి గొంతులో జీర విన్పించింది.

"మరెందుకూ..." అన్నాను నేను కూడా సీరియస్‌గా

"నాన్నకి పట్టిన గతి ఇంకెవరికీ రాకూడదని..." సుడులు తిరుగుతూ వచ్చిన దుఃఖాన్ని ఆపుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

అప్పుడర్థమైంది నాకు... విషయమేంటో... తర్వాత రెండు నిమిషాల వరకూ వాడేం మాట్లాడలేదు.

"మీకు పంపిస్తున్న డబ్బు... నా మొదటి సంపాదన..." అన్నాడు బరువుగా. ఈసారి నా గొంతు పెగల్లేదు.

"సరే..." అని సెల్ ఆఫ్ చేసాక... ఎంత ప్రయత్నించినా ఆ రాత్రి నిద్ర పట్టలేదు. మూడేళ్లకింది సంఘటనలు ఇంకా గుండెని మెలి తిప్పుతున్నాయి.

అమరేంద్ర కుటుంబం, మేము ఒకే ఇంట్లో కిరాయికుండేవాళ్లం. అమరేంద్ర తండ్రి బిల్డింగ్‌లు కట్టే మేస్త్రీగా పని చేసేవాడు. ఓరోజు కృష్ణానగర్‌లో కడుతున్న బంగ్లా మీంచి కాలుజారి పడ్డాడు. తలకి బాగా దెబ్బ తగిలింది.

జగిత్యాలలో ఏ ఆస్పత్రికి తీసికెళ్లినా డాక్టర్లు జాయిన్ చేస్కోలేదు. కండిషన్ సీరియస్‌గా వుందనటంతో వెంటనే హైదరాబాద్ తీసికెళ్లిపోయారు. రాత్రి ఎనిమిది గంటలకు హైదరాబాద్ నించి అమరేంద్ర నాకు ఫోన్ చేసాడు. "నాన్న చనిపోయిండురా... తీసుకొస్తున్నాం" అని. నాకైతే దుఃఖం ఆగలేదు. అణిచిపెట్టుకుంటూ అమ్మవాళ్లకు చెప్పాను... అమ్మ చెల్లీ పెద్దగా ఏడ్వటం మొదలెట్టారు. ఆ ఏడ్పులు విని కంగారుగా ఇంటి ఓనర్ పైనించి పరిగెత్తుకొచ్చాడు.

"ఏమైంది" అన్నాడు కంగారుగా

"అమరేంద్ర నాన్న హాస్పిటల్లోనే చనిపోయాడట. శవాన్ని తీసుకొస్తున్నారు" అని చెప్పాను. ఇంటి ఓనర్ మొహంలో ఒక్కసారిగా రంగులు మారాయి.

"శవాన్ని ఎక్కడికి తీసుకొస్తున్నారట..." అన్నాడు మొహం చిట్లించి.

"ఇక్కడికే" అన్నాను.

"నా ఇంటికి శవం రావద్దు... ఇక్కడికి తీసుకు రావద్దని చెప్పండి" అన్నాడు కఠినంగా.

"ఎందుకు అంకుల్" అన్నాను అర్థం గాక.

"నా ఇంటికి శవం రావద్దయ్యా... ఏ ఘడియలో చచ్చాడో ఏంటో... ఇంటికి అరిష్టం తగులుతుంది. దుర్ముహూర్తంలో చస్తే ఆర్నెల్లు, ఏడాది ఇల్లు విడిచిపెట్టాల్సి వస్తుంది. అందుకే వద్దని ఫోన్ చేయ్..." అన్నాడు మరింత సీరియస్‌గా.

నేను షాకయ్యాను.

"మరెక్కడికి తీసుకెళ్లాలి... వాళ్లు హైదరాబాద్ నించి వచ్చేసరికి రాత్రి పదకొండవుతుంది. వర్షం కూడా మొదలైంది కదా అంకుల్..." అన్నాను.

"డైరెక్టు శ్మశానానికి తీసికెళ్ళమనండి... తగిలేసాక పన్నెండు రోజులదాకా నా ఇంటికి కూడా రావద్దు... నా ఇంట్లో ఎవడో చచ్చిన పిండాలు పెడ్తారా ఏంటి... మాకు మంచి జరగాలి కదా..." అన్నాడు. అప్పుడే వాళ్లావిడ వచ్చి ఇలాంటి మాటే అంది.

"ఇల్లు కిరాయిస్తే ఒక బాధ... ఇవ్వకుంటే మరో బాధ" గొణుక్కుంటూ లోపలికెళ్లిపోయారు.

నాకేం చేయాలో అర్థం కాలేదు... పూల మొక్కలు పెంచుతూ పరిశుభ్రంగా చూసుకుంటున్న ఇల్లు ఒక్కసారిగా పాడుబడ్డట్టుగా కన్పించింది.

అమరేంద్రకి ఫోన్ చేసి... విషయం చెప్పాను.

వాడు ఏడుస్తూనే... 'ఇప్పుడెలారా...' అన్నాడు.

వర్షం ఎక్కువైంది.

"సుమోలో వస్తున్నారు కదా... మీరైతే అంగడి గద్దెల దగ్గరకు వచ్చి ఆగండి... మేమంతా అక్కడుంటాం..." అన్నాను.

ఫ్రెండ్సందరికీ ఫోన్ చేసి విషయం చెప్పాను.

వర్షం భారీగానే పడుతోంది. పదింటి వరకు అందరం అంగడి గద్దెలకు చేరుకున్నాం. వేపచెట్టు కింద కొంచెం తడుస్తూనే నిల్చున్నాం. అయిదుగురం ఫ్రెండ్స్ ఏమీ మాట్లాడుకోలేదు.

సుధాకర్‌గాడు సిగరెట్ దమ్ము గట్టిగా పీల్చి కసిగా అన్నాడు.

'నెలకింద మా తాతయ్య చనిపోయే ముందు... ఇదే పరిస్థితిరా... ముసలాయన ఇంకో రెండు గంటల్లో చనిపోతాడనంగా... ఇంటి ఓనర్‌గాడు నా ఇంట్లో మనిషి చావొద్దు ఇల్లు ఖాళీ చేయండి లేదంటే బయటికి తీసికెళ్ళండి అని ఒకటే పోరు. ఏం చేయాలో అర్థం గాక... గవర్నమెంట్ హాస్పిటల్‌కి తీసికెళ్లి జాయిన్ చేసాం. అయిదారు గంటల తర్వాత తాత అక్కడ చనిపోయాక... అటునించి అటే తీసికెళ్లి దహనం చేయాల్సి వచ్చింది. " అన్నాడు.

అందరిలోనూ ఏదో తెలియని బాధ... మనసంతా బురదనీళ్ల చిత్తడి...

మనిషి చనిపోయినందుకు కాదు.. ఈ సమస్య వింతగా... విచిత్రంగా కన్పిస్తున్నందుకు. పుట్టెడు శోకంలో వున్న వారిని కత్తులతో పొడుస్తున్నట్టు... మనుషులింత కఠినంగా వుంటారా అన్పించింది.

అప్పటికే వర్షానికి సగం తడిసిపోయాం.

పదకొండు కావస్తున్న వాళ్ల సుమో రాలేదు. మళ్లీ ఫోన్ చేసాం. సిద్దిపేట దగ్గర్లో టైర్ పంక్చరైందని చెప్పాడు అమరేంద్ర.

మల్లిక్ గాడు బురదనీటిని కసిగా తన్ని చెప్పాడు.

"నాకూ ఇప్పుడు గుర్తొస్తుందిరా... నాలుగేళ్ల కింద మా నానమ్మ కి ఇదే పరిస్థితి. కేన్సర్‌తో నెల రోజుల్లో చనిపోతుందని డాక్టర్లు చెప్పారు. బతికున్నప్పుడే ఇల్లు ఖాళీ చేయమంటాడు ఇంటి ఓనరు. చనిపోతుందని తెల్సి ఎవరూ ఇల్లు కిరాయికివ్వరు. నరకం అనుభవించాం. చివరికి మా పల్లెటూరుకి తీసికెళ్లాల్సి వచ్చింది" అన్నాడు.

వర్షానికి కడుపులోంచి చలి రావటం మొదలైంది.

శశిగాడు తడుస్తూనే ఎటో పరిగెత్తాడు. అందరం మొహాలు చూసుకునేలోగానే లీటర్ నీళ్ళ బాటిలు, హాఫ్ విస్కీ బాటిల్‌తో అంతే వేగంగా వచ్చాడు. గబగబా నీళ్ల బాటిల్‌ని ఓపెన్ చేసి సగం నీళ్ళు పారబోసి... విస్కీని దాంట్లో నింపి కొంత లాగించి బాటిల్‌ని మనోహర్‌కిచ్చాడు. అందరి మధ్య బాటిల్ తిరుగుతోంది.

శశిగాడు నోరు తెరిచాడు.

"మా ఇంటి ఓనర్ చాలా తెలివైనోడ్రా... మా కాంప్లెక్స్‌లో వాళ్లుండరు. హౌసింగ్ బోర్డు కాలనీలో వుంటారు. మా పక్క పోర్షన్ వాళ్లబ్బాయి రోడ్డు ప్రమాదంలో చచ్చిపోతే ఆయన కూడా వచ్చి ఏడ్చాడు. అందరితో పాటు ఓదార్చాడు. పెళ్లికాని అబ్బాయి కదాని... జిల్లేడు చెట్టు తెప్పించి పెళ్లి చేయించాడు. పెద్దకర్మ కూడా జరిపించమన్నాడు... చివర్లో మాత్రం చావు కబురు చల్లగా చెప్పాడు... శవం తరలిపోయిన ఇల్లు కదమ్మా... కాంప్లెక్స్‌కి సున్నం వేయించండి అని... కర్మ ఖర్చు పన్నెండు వేలైతే... ఎనిమిది పోర్షన్లున్న కాంప్లెక్స్‌కి సున్నం ఖర్చు తొమ్మిదివేలయింది..." అన్నాడు.

రాత్రి భారంగా గడుస్తోంది.

వీళ్ల మనస్తత్వాల ముందు చీము నెత్తుర్లు పారే వైతరిణీ నది ఏపాటిది అన్పించింది.

ప్రాణం పోయిన వెంటనే మనిషి అంటరాని వాడవుతాడా... మరి గుండె గదుల్లో జ్ఞాపకాల మధ్య తిరుగుతున్నాడు కదా...

ఏవేవో ఆలోచనలు...

పన్నెండున్నర వరకు సుమో వచ్చింది.

అమరేంద్ర, అమ్మ, చెల్లి మేం కన్పించగానే బోరున ఏడ్చారు. గంట వరకు వాళ్లని ఓదార్చటం సాధ్యం కాలేదు.

సుమో వెనుక భాగంలో సుతారి రాజయ్యని నిర్జీవంగా చూసి మా గుండెలవిసిపోయాయి.

నా ఆలోచనలన్నీ ఆయనతో పంచుకున్న అనుభవాలై గుర్తుకొస్తున్నాయి.

వర్షంలో పూర్తిగా తడిసి పోతున్నామన్న స్పృహ కూడా లేదు. ఇన్ని ఇండ్లు కట్టించినా ఏనాడు తనకో సొంతిల్లు కావాలని ఆశ పడలేదు. కట్టిన ప్రతి ఇల్లు తనదేఅన్నంత అపురూపంగా చూసుకునేవాడు. గృహ ప్రవేశం రోజు ఎవరైనా కొత్త బట్టలు పెడితే మురిసిపోయేవాడు. ఆ ఇల్లు నేనే కట్టాన్రా... అని గర్వంగా చూపించేవాడు.

వర్షంతో అందరం మళ్లీ గడ్డకట్టుకుపోయాం...

ఎప్పుడు తిన్నారో... ఏడ్వడానిక్కూడా ఓపిక లేనట్టుగా గద్దెమీద కూలబడిపోయారు. ఆ రాత్రి కన్నా... వర్షం కన్నా భయంకరమైన విషయం... శవాన్ని రోడ్డు పక్కగా పెట్టుకొని వుండటం...

ఎంతకీ తెల్లారట్లేదు... ఎవరూ మాట్లాడుకోవటం లేదు.

హైదరాబాద్ నించి మాట్లాడుకొని వచ్చిన సుమో డ్రైవర్ "సార్... శవాన్ని దింపేసుకోండి... నేను మళ్లీ హైదరాబాద్ వెళ్లిపోవాలి" అని అడుగుతున్నాడు. అలా చాలా సార్లు అడిగేసరికి... విధిలేక శవాన్ని దించి వేపచెట్టు గద్దెమీద పడుకోబెట్టాం

సుమో వెళ్లిపోయింది...

తెల్లవారుతుంటే వర్షం తగ్గుముఖం పట్టింది...

❀ ❀ ❀

రాజయ్యకున్న మంచితనానికేమో... తెల్లారినంక విషయం తెల్సి చాలా మంది వచ్చారు. కన్నీళ్లు పెట్టుకున్నారు. ఎవరూ చెప్పకుండానే పాడె కట్టారు. ఇంటి ఓనరు కూడా వచ్చి సానుభూతిగా రాజయ్య మంచితనం గురించి చెప్తున్నాడు.

శవయాత్ర జరుగుతున్నంత సేపూ... నా కళ్ళన్నీ రాజయ్య కట్టిన ఇండ్లనే చూస్తుండిపోయాయి. ఆ ఇండ్లన్నీ శవాన్ని చూసి తడిసి ముద్దయినట్టనిపించాయి. దుఃఖిస్తున్నట్టు కన్పించాయి...

దహనమయ్యాక... మరోసమస్య...

పన్నెండు రోజులూ ఎక్కడుండాలి... ? ఇంటి ఓనర్ చెప్పిన విషయాన్ని అమరేంద్రకు చెప్పాను. అది విన్న ఓ పెద్ద మనిషి 'తప్పదు... లాడ్జింగ్‌లో వుండాల్సిందే...' అన్నాడు. చివరికి అందరూ అదే మాటన్నారు. కాని ఇంటి ఓనర్‌ని ఎవరూ విమర్శించలేదు.

"ఎవరిదైనా ఇల్లే కదా... ఎలా రానిస్తారు" అని వత్తాసు పలికారు.

లాడ్జింగ్‌కు వెళ్లక తప్పలేదు.

మూడో రోజు బ్రాహ్మణుడిని పిలిచి పింద ప్రదానం చేయిస్తుంటే... పక్క గదిలో ఆర్నెల్ల నుంచి వుంటున్న ఓ హస్త సాముద్రికుడు... లాడ్జింగ్ ఓనర్ మీద ఎగిరి గంతులేసాడు. లాడ్జింగ్‌లో పిండాలేమిటి... కష్టమర్లు, భక్తులు రావట్లేదు. నేను గదిని ఖాళీ చేస్తాను అని, వేరే గదుల్లో వాళ్లు కూడా అతడ్ని సపోర్ట్ చేసారు. దాంతో లాడ్జింగ్ ఓనర్ వీళ్లని ఖాళీ చేయమన్నాడు. చివరికి అందరం బతిమిలాడితే నాలుగో అంతస్తు టెర్రస్ మీదున్న ఒక గదిలోకి మారమన్నాడు. ఆ పన్నెండు రోజులు అమరేంద్ర చాలా బాధ పడ్డాడు.

తండ్రిపోయిన దుఃఖం కన్నా... మనుషుల మనస్తత్వాలు వాన్ని బాగా కుంగదీసాయి.

❀ ❀ ❀

నాలుగు నెలలు గడిచాయి.

సుధాకర్, మల్లిక్, శశిగాడి సహాయంతో... ఒక హాలు, మూడు గదులతో శ్మశానానికి దగ్గర్లో బిల్డింగ్ శరవేగంగా పూర్తయింది. అది కడుతున్నప్పుడే చాలా మందికి ఈ విషయం తెల్సింది. బిల్డింగ్ ఫోటోలు తీసి అమెరికా పంపించాడు మల్లిక్ అవి చూసి అమరేంద్ర ఆనందంగా ఫోన్ చేసాడు.

సుధాకర్‌గాడి ఆలోచనతో బిల్డింగ్ మీద 'కీ॥శే॥ మాదాసు రాజయ్య స్మారక కర్మకాండ భవనం" అని రాయించటంతో వాడు మరింత సంబరపడిపోయాడు.

'మీ అందరికి'మెనీ మెనీ థాంక్స్‌రా... ' అన్నాడు.

మరో విషయం చెప్పాను.

"మీ నాన్న దగ్గర తాపీ పని చేసే సాంబయ్య... పని లేక ఒంటరివాడయ్యాడు. మీ నాన్న చనిపోయాక ఎవరూ పనివ్వలేదు. అందుకే అందులో ఒక గది ఇచ్చి... బిల్డింగ్ పనిలో మిగిలిన ఇరవై వేలు అతడి చేతిలో పెట్టాను. దహన సంస్కారాలకు, కర్మకు అవసరం పడే వస్తువులు అన్నీ కొని... అవి అమ్ముకుంటూ బతకమన్నాను. మనం ముంబై వెళ్ళినప్పుడు మిత్రుడు సంగెవేని రవీంద్ర పాడె దుకాణాల బజార్‌ని చూయించాడు... గుర్తుందా... ఆ స్ఫూర్తితో... అలాగే అతడికి సెల్లు కొనిచ్చాను. రేపు పత్రికల్లో ఈ కర్మకాండ భవనం గురించి రాయించి సాంబయ్య సెల్లు నంబర్ కూడా ఇస్తాను... సరేనా... " అని అన్నాను.

వాడేదో బరువు దిగిపోయినట్టు... దీర్ఘంగా శ్వాస తీసి వదలటం స్పష్టంగా నాకు విన్పించింది.

"పున్నామ నరకం నించి తప్పించేవాడే పుత్రుడు అంటారు.

ఆ నరకం గురించి నాకు తెలీదుకాని... చాలా మంది సొంతిల్లు లేని తల్లిదండ్రులకు నువ్వీ నరకం నించి తప్పించావ్‌రా... అభినందనలు..." అన్నాను. సెల్ ఆఫ్ చేసాక....

నా కళ్లల్లో కూడా అప్రయత్నంగా... నీళ్లొచ్చాయి...